క్లుప్తంగా

విదేశీ విద్యకు ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ప్రకాశ్‌రావు

వరంగల్ చౌరస్తా: ఆర్థికంగా వెనుకబడిన గౌరిశెట్టి శివసాయికి వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉన్నత విదేశీ విద్యాపథకం ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. వరంగల్ ఆర్ఎస్‌టీ రోడ్డులోని పట్టణ ఆర్య వైశ్య భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో శివసాయికి మాజీ మేయర్, పట్టణ అధ్యక్షుడు గుండు ప్రకాశ్‌రావు రూ.10,116 పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రావు మాట్లాడుతూ విదేశాలకు వెళ్లే నిరుపేద ఆర్యవైశ్యులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మల్యాల వీరమల్లయ్య, వెలిశాల ఆనంద్, సదాశివుడు, పాల మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత



బ్యాగు అప్పగిస్తున్న హోంగార్డు కుమారస్వామి

కాజీపేట: కాజీపేట పట్టణంలో ప్రధాన రహదారిపై హ్యాండ్ బ్యాగును పోగొట్టుకున్న మహిళను గుర్తించి బ్యాగును ఓ హోంగార్డు ఆదివారం సాయంత్రం అప్పగించి తన నిజాయితీని చాటుకున్నారు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న కుమారస్వామికి భారత ఆహార సంస్థల గోడౌన్ వద్ద రహదారిపై హ్యాండ్‌బ్యాగు దొరికింది. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి బాధిత మహిళను గుర్తించి బ్యాగు అందించారు. బ్యాగులో విలువైన వస్తువులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బ్యాగును అందించిన కుమారస్వామికి బాధిత మహిళా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి గ్రామంలో భక్త మార్కండేయ దేవాలయ ఆవరణలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలను భక్తులు ఆదివారం జరుపుకున్నారు. అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ పర్యవేక్షణలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. మంచికట్ల సాంబమూర్తి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఉత్సవాల నిర్వహణకు రూ.5 లక్షలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుర్రపు కోటేశ్వర్, మంచికట్ల మురళిమోహన్, రాజేంద్ర ప్రసాద్, కరుణాకర్, ఆడెపు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు



మడికొండ: మడికొండలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో గౌడ సంఘం కులపెద్దలు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ ఏడాది మే నెలలో ఎల్లమ్మకు గౌడ కులస్తులు బోనాలను సమర్పిస్తారు. సోమవారం సాయంత్రం కుల సంఘం మహిళలు బోనాలను తీసుకొని ఎల్లమ్మ ఆలయానికి బయలుదేరి అమ్మవారికి బోనాలను సమర్పిస్తారు. మంగళవారం ఉదయం బలిహారణ నిర్వహించనున్నట్లు కుల సంఘం అధ్యక్షుడు బుర్ర రాజన్‌బాబు తెలిపారు. పూజా కార్యక్రమంలో కుల సంఘం పెద్దలు మాచర్ల రాజు, మునిగాల రాజు, బొల్లికొండ రవీందర్, సాంబరాజు పాల్గొన్నారు.

అవకాశమివ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి, పక్కన రామ్మోహన్

హన్మకొండ అర్బన్: హనుమకొండ రెడ్‌క్రాస్ ఎన్నికల్లో కొత్త పాలకవర్గానికి అవకాశం కల్పించాలని ప్యానెల్‌గా ఏర్పడి పోటీ చేస్తున్న ప్రతినిధులు పొన్నాల రాంమోహన్, డాక్టర్ ఎస్.విజయలక్ష్మి కోరారు. ఈనెల 9న జరగనున్న రెడ్‌క్రాస్ ఎన్నికల నేపథ్యంలో బాలసముద్రంలోని రాంమోహన్ నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమకు అవకాశం కల్పిస్తే పూర్తి పారదర్శకంగా రెడ్‌క్రాస్ సేవలు విస్తృతం చేస్తామని, నిధులు సమీకరించి అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గుజ్జుల శ్రీనివాస్‌రెడ్డి, పొన్నాల సంయుక్త, డాక్టర్ జగదీశ్వర్‌ప్రసాద్, మండల పరశురాములు తదితరులు మాట్లాడారు.

నిల్చోలేం.. కూర్చోలేం!



ఖిలా వరంగల్: రహదారిపై నిలబడి బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

- బస్సు షెల్టర్లు లేక తీవ్ర అవస్థలు
- రోడ్లపైనే నిలబడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- కాజీపేట రైల్వే స్టేడియంలో బస్టాండ్ ఏర్పాటు చేయాలని డిమాండ్

ఖిలా వరంగల్: వరంగల్ నగరం రోజురోజుకు విస్తరించడమే కాకుండా శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. జనాభాకు తగ్గట్టుగా రహదారుల విస్తరణ సైతం వేగంగా జరుగుతోంది. అయితే వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ వద్ద బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారిపై బస్‌షెల్టర్ ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రయాణికులు, ప్రజల ఆరోపిస్తున్నారు.

ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు రహదారిపై నిలబడుతున్నారు. ఇక్కడి నుంచి పలు డివిజన్లకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. కోటను సందర్శనకు వచ్చే పర్యాటకులు ఇక్కడే దిగి కోటను సందర్శించి తిరిగి ఇక్కడే బస్సు ఎక్కి వెళ్తుంటారు. అలాంటి జంక్షన్‌లో బస్‌షెల్టర్ లేక పలువురు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రయాణికులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ బస్సుల కోసం ఎదురుచూస్తుంటారు. అధికారులు అవసరం ఉన్న చోట షెల్టర్లు నిర్మించకుండా లేనిచోట నిర్మించి లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

నిలువ నీడలేక నరక యాతన

కాజీపేట: కాజీపేట పట్టణంలో సరైన వసతులు లేక ప్రయాణికులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం కొరవడడం.. ఇక్కడ బస్టాండు ఏర్పాటు ప్రక్రియకు ప్రధాన అడ్డంకిగా మారింది. దాదాపు 60వేల పట్టణ జనాభాతో పాటు నిత్యం మూడు లక్షమందికి పైగా ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. ట్రైసిటీలో ఒకటిగా పిలువబడే కాజీపేట పట్టణంలో సరైన వసతులతో బస్టాండు లేకపోవడతో ప్రధాన రహదారిపైనే ఎండ, వానల్లో అవస్థలు పడుతూ బస్సుల కోసం వేచిఉండి ప్రయాణం చేస్తుంటారు. ఆర్టీసీ అధికారులు రోడ్డు పక్కన వేసిన చిన్న షెల్టర్ల కింద నిలబడాల్సిన దుస్థితి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపకపోవడంతో బస్టాండు అనే మాట పట్టణ ప్రజలకు తీరని కలగా మిగిలింది. జాతీయ రహదారితో పాటు రైలు మార్గం ద్వారా వేల సంఖ్యలో ప్రయాణికులు కాజీపేట మీదుగా ప్రయాణం చేస్తుంటారు. వారంతా రోడ్లపై నిలబడే ఆటోలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వాల మధ్య కొరవడిన సమన్వయం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పూర్తిగా సమన్వయం కొరవడింది. ఫలితంగా ప్రయాణికులు నానా అగచాట్లకు గురవుతున్నారు. రైల్వే జంక్షన్ ఎదుట ఒక చిన్నపాటి బస్ బేను నిర్మించి చేతులు దులుపుకున్నారు. ఇక్కడ ప్రయాణికులకు కనీస అవసరాలు తీర్చే మార్గం లేదు. ఇటు హైదరాబాద్, అటు వరంగల్ వైపు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఎండలో నిలబడాల్సిందే. ఇలా బస్సుల కోసం వేచి చూస్తూ ప్రమాదాల బారిన పడినవారు కూడా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుమతితో ప్రస్తుతం రైల్వే స్టేడియంగా ఉన్న స్థలంలో బస్టాండు నిర్మించడం వల్ల ప్రజలకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



కాజీపేట బస్టాప్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

బస్టాండు నిర్మించాలి



కాజీపేట పట్టణంలో బస్టాండు నిర్మాణం అనేది ప్రజలకు కలగా మారింది. గమ్యస్థానాలకు చేరుకోవడానికి రహదారుల వెంట ప్రయాణికులు ఎండ, వానలు లెక్క చేయక నిలబడాల్సి వస్తోంది. ఆర్టీసీ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలి.

\- మారగోని భద్రయ్య, కాజీపేట

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



రోడ్డుపై బస్సు కోసం ఎదురుచూస్తూ ప్రయాణికులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల అభ్యర్థన మేరకు ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తా.

\- బైరబోయిన ఉమ, కార్పొరేటర్, 38వ డివిజన్

బొడ్రాయి పునఃప్రతిష్ఠ మహోత్సవం



పూజ చేస్తున్న ఎమ్మెల్యే రమేష్

వరంగల్: గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ ఆరెపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన పట్టాభి రామాలయ విగ్రహ శివాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి కన్వీనర్ లలితాయాదవ్, స్థానిక డివిజన్ కార్పొరేటర్ జన్ను షీబారాణి, పాక్స్ చైర్మన్ హరికృష్ణ, డివిజన్ అధ్యక్షుడు నేరెళ్ల రాజు, జిల్లా నాయకులు బుద్దె శ్రీనివాస్, బుద్ధ వెంకన్న, ఆదాం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థినుల బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హనుమకొండ అంబేడ్కర్ సెంటర్ నుంచి ఉదయం 9గంటలకు బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. హనుమకొండ పెట్రోల్‌పంప్ మీదుగా నయీంనగర్, కేయూసీ క్రాస్, రామారం మీదుగా ఎర్రగట్టుగుట్ట వరకు బైక్‌ర్యాలీ సాగుతుందని వివరించారు. కార్యక్రమానికి హనుమకొండ, వరంగల్, కాజీపేట ఏసీపీలు పాల్గొననున్నట్లు చెప్పారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఖిలా వరంగల్: వేసవిలో గుక్కెడు తాగునీటి కోసం తల్లాడిపోతున్నామని, తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరించాలని భూపేష్‌నగర్ కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ 34వ డివిజన్ శివనగర్ భూపేష్‌నగర్ కాలనీ రోడ్డుపై స్థానిక మహిళలు ఖాళీ బిందెలతో ఆదివారం నిరసన తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ నాయకుడు గోరంటల శరత్ బాబు మాట్లాడుతూ పైపులైన్ ద్వారా సరఫరా జరిగే తాగునీటిపై కాలనీవాసులు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వేసవిలో బావులు, బోర్లు ఎండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో ప్రశాంతి, స్పందన, సరళ, అనిత తదితరులు పాల్గొన్నారు.

11న బొమ్మల కట్టయ్య వర్ధంతి



బొమ్మల అంబేడ్కర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కరీమాబాద్: ఈనెల 11న నిర్వహించనున్న భారతీయ బౌద్ధ మహాసభ జాతీయ కార్యదర్శి, అంబేడ్కర్ వాది బొమ్మల కట్టయ్య రెండవ వర్ధంతిని విజయవంతం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మల అంబేడ్కర్, అంబేడ్కర్ భవన కమిటీ అధ్యక్షుడు నీలం మల్లేషం పిలుపునిచ్చారు. కరీమాబాద్ అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో అంబేడ్కర్ సంఘాలను విస్తరించేందుకు కట్టయ్య ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. కరీమాబాద్‌లోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న వర్ధంతి కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారని తెలిపారు. కాగా, రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన అంబేడ్కర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎరుకల మహేందర్, తరాల రాజమణి, కడారి కుమార్, భిక్షపతి, శంకర్, గౌతం, సిద్ధార్థ, రాంప్రసాద్, రవితేజ, దామోదర్, సుధాకర్, సురేష్, విక్రమ్, వినోద్, శివ, నాగమణి, సౌజన్య, మనోహర, శ్రీదేవి పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న బాధిత కార్మికులు

హన్మకొండ చౌరస్తా: అకారణంగా తొలగించిన పెట్రోల్ బంక్ కార్మికులను వెంటనే తిరిగి పనిలోకి తీసుకోవాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల సారంగపాణి డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని విశ్వేశ్వర సర్వీస్ స్టేషన్ (హిందూస్తాన్ పెట్రోలియం)లో ఆవరణలో కార్మికులతో కలిసి ఆదివారం నిరసన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ 30ఏళ్లుగా పనిచేస్తున్న సుమారు 20మంది కార్మికులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలగించడం సరికాదన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవడంతో పాటు పనిభద్రత, ఈఎస్ఐ, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికులను ఐక్యం చేసి ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెట్రోల్ బంక్ కార్మిక సంఘం నాయకులు మంద యాకనారాయణ, దయానంద్, కాశబోయిన కొమురయ్య, బుర్ర గోవర్దన్, వెంకటేష్, శ్రీనివాస్, రేవంత్, సరళ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అలువాల 'బలగం' ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో అలువాల కుటుంబ సభ్యులు

వరంగల్: ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన అలువాల మల్లయ్య – ప్రమీల దంపతులకు చెందిన కుటుంబ సభ్యులు హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని నేరెళ్ల సమీపంలోని ఓ ప్రైవేట్ రిసార్ట్‌లో ఆత్మీయ 'బలగం' సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రమీల, మల్లయ్య దంపతులకు ఐదుగురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. మల్లయ్య 2004లో మృతి చెందారు. కుమారులు, కుమార్తెలు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. కుటుంబంలో ఎవరిదైన పెళ్లి లేదా ఇతర కార్యక్రమాలు జరిగే తప్ప కలుసుకోని పరిస్థితులు నెలకొనడంతో ప్రతిఏటా అందరు కలుసుకునేందుకు కుటుంబ పెద్ద జ్ఞాపకార్థం 2020లో అలువాల ఫైనాన్షియల్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. ప్రతినెల రూ.500ల చొప్పున ఏడాది పాటు జమ చేసి, ప్రతిఏటా వార్షిక సమావేశాన్ని జరుపుకుంటున్నారు. అలువాల బలగం చిన్నా, పెద్దలు కలిసి 80 మంది ఉంటారు. కార్యక్రమంలో మల్లయ్య, ప్రమీల దంపతుల కుటుంబ సభ్యులు పి.రాజయ్య, రమేష్, రవీందర్, కుమారులు సదాశివుడు, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, బాలరాజు, సునీల్, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

భరోసా సభకు తరలిన బీఎస్పీ నాయకులు

హసన్‌పర్తి: హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ భరోసా సభకు వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు చాతళ్ల వేణుగోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. కార్యకమంలో పీపీఎల్ రాష్ట్ర కన్వీనర్ చాతళ్ల సదానందం, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బండి ఓంకార్, మండల అధ్యక్షుడు మెరుగు కృష్ణగౌడ్, నాయకులు మేకల అభినేష్, పవన్‌కళ్యాణ్, హరికృష్ణ పాల్గొన్నారు.

సభకు తరలిన బీఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు

కేయూ క్యాంపస్: బహుజన సమాజ్‌పార్టీ (బీఎస్పీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ భరోసా బహిరంగ సభకు బీఎస్ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ ఆధ్వర్యంలో కేయూ నుంచి పలువురు విద్యార్థులు తరలివెళ్లారు. బీఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు కట్కూరు సునీల్, కేయూ అధ్యక్షుడు మాసం సల్మాన్, బాధ్యులు సాయికుమార్, శ్రవణ్ తదితరుల బస్సులో తరలివెళ్లారు.

హనుమాన్ శోభాయాత్ర



మడికొండ: కాజీపేట మండలం మడికొండలో హనుమాన్ శోభాయాత్రను ఆదివారం నిర్వహించారు. మెట్టుగుట్ట వద్ద ఉన్న పోచమ్మ ఆలయం వద్ద నుంచి ఉదయం ప్రారంభమైన శోభాయాత్ర.. మడికొండ చౌరస్తా మీదుగా ఎస్సీ కాలనీ నుంచి వేణుగోపాలస్వామి ఆలయం వరకు కొనసాగింది. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిగ్గుల సతీష్‌కుమార్, దువ్వ శ్రీకాంత్, నవీన్, ఆకుల శరత్, బండ రాజు, రాజు పాల్గొన్నారు.

కాజీపేటలో అంజన్న భక్తుల ర్యాలీ



కాజీపేట: కాజీపేట పట్టణ పురవీధుల్లో పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ భక్తులు ఆదివారం రాత్రి ఆంజనేయుడి భారీ విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా యాదాద్రి జిల్లా నుంచి తెప్పించిన హనుమంతుడి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై అలంకరించి ఊరేగించారు. గిరిజన కళాకారులు, కోలాట బృందం, చెక్క భజనల కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. హనుమాన్ మాలధారులు, భక్తుల కోలాహలం మధ్య ఊరేగింపు సాగింది.

పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి



ఖిలా వరంగల్: పద్మశాలి కులస్తులు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాలని పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ సూచించారు. వరంగల్ శివనగర్‌లో పద్మశాలి ప్రతినిధుల ఆధ్వర్యంలో బుదారపు భాస్కర్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఎన్నికైన పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వొడ్నాల నరేందర్, సేవారత్న అవార్డు అందుకున్న రమేష్, కవికోకిల అవార్డు గ్రహీత గుండు వెంకటేశ్వర్లును పద్మశాలీలు అభినందించారు. కార్యక్రమంలో భాస్కర్, వెంకటనర్సయ్య, సోమయ్య, ఆడెపు శ్యామ్, నామాని రాజ్‌కుమార్, కుడికాల మనోహర్, దాసు సరేందర్, రాజమల్లు, రఘు, సతీష్, సింగం ప్రతాప్, శ్రీను, శ్రీధర్ పాల్గొన్నారు.

విలీన గ్రామాల అభివృద్ధే ధ్యేయం



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

మామునూరు: విలీన గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. వరంగల్ 17వ డివిజన్ పరిధిలోని గాడిపెల్లి గ్రామంలో కార్పొరేటర్ గద్దె బాబుతో కలిసి ఎమ్మెల్యే ఆదివారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లు, డ్రెయినేజీలు, పాత గ్రామ పంచాయతీ భవన సముదాయం, హనుమాన్, రామాలయ నిర్మాణాల కోసం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనులకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. హనుమాన్, రామాలయ నిర్మాణాల కోసం స్థలాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దామోదర్, బెంబిరి బాబురావు, పోచన స్వామి పాల్గొన్నారు.

నిరుపేద మహిళ ఇల్లు కూల్చడం సరికాదు



నిరాహార దీక్షలు చేస్తున్న బాధితులకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

వరంగల్: నగరంలోని 13వ డివిజన్ ఎంహెచ్‌నగర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన దామెర అశోక్, మైబు దంపతుల ఇంటిని కొంతమంది బీఆర్ఎస్ నాయకులు కూల్చివేసి అందులో పార్టీ జెండాను నిర్మించడం సరికాదని బీజేపీ నాయకుడు సముద్రాల పరమేశ్వర్ అన్నారు. ఇల్లు కూల్చి జెండా గద్దెను కట్టిన స్థలంలో నిరాహార దీక్షలు చేస్తున్న అశోక్, మైబు దంపతులకు ఆదివారం సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద మహిళ మైబుకు చెందిన 60గజాల స్థలాన్ని కబ్జా చేసి తిరిగి అడిగేందుకు వచ్చిన క్రమంలో పార్టీ జెండా ప్రత్యక్షమవడం దారుణమని వాపోయారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, ప్రవీణ్, పోలెపాక మార్టిన్ లూథర్, మాదాసు రాజు, పిట్ట సరస్వతి, యువ మోర్చా నాయకులు బైరి హరీష్, గోవింద్ సింగ్, కోమాకుల నాగరాజు, కోట సతీష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం



చిరుధాన్యాలను ప్రదర్శిస్తున్న కార్పొరేటర్ వసంత, రికార్డ్ సంస్థ ప్రతినిధులు

హన్మకొండ అర్బన్: ప్రతీఒక్కరు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత అన్నారు. నగరంలోని కనకదుర్గ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో రికార్డ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన, చిరుధాన్యాల వల్ల ఉపయోగాలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలను రోజువారీ ఆహారంలో భాగంగా తీసుకోవాలని చెప్పారు. వాటిలోని పోషకాల వలన ఆరోగ్యానికి మేలు కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో రికార్డ్ సేవా సంస్థ బాధ్యులు కుసుమ కవిత, కుసుమ సురేష్, ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, కనకదుర్గ కాలనీ కార్యదర్శి నారాయణ, వీఆర్ విద్యార్థి, వనం వెంకటేశ్వరరావు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కాలనీలను అభివృద్ధి చేసుకుందాం

ఖిలా వరంగల్: వెనకబడిన కాలనీలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందామని శంభునిపేట, రంగశాయిపేట కాలనీల డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు కర్నె రవీందర్, రామానుజం జగదీశ్వర్ సూచించారు. ఈమేరకు వరంగల్ – ఖమ్మం రోడ్డులోని సిల్వర్ క్రోస్ పాఠశాల ప్రాంగణంలో నాగబండి శ్రీనివాస్ గుప్తా అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నగర మేయర్ గుండు సుధారాణి, తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ సహాయ సహకారాలతో రోడ్లు, డ్రెయినేజీలను అభివృద్ధి చేసుకుందామని అన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, శ్రీనివాస్, కవిత, బూర హరిప్రసాద్, ప్రహ్లాద్‌రావు, అశోక్, రవి, రాజు, రమేష్, ప్రవీణ్, మురళి, రవీందర్‌రావు, సంజీవరెడ్డి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.